సుందరం.. సుమనోహరం..



కొత్తగా వేసిన రోడ్డు



మెరుస్తున్న ఫుట్‌పాత్



గోడలపై వేసిన అందమైన చిత్రాలు

- జీఐఎస్ సదస్సుకు ముస్తాబు
- 'తూర్పు'లో రహదారులకు కొత్త శోభ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్) సదస్సు నేపథ్యంలో తూర్పు నియోజకవర్గంలోని ప్రధాన రహదారిని సుందరంగా తీర్చిదిద్దారు. సిరిపురం కూడలి వద్దనున్న దత్ ఐలాండ్ నుంచి బీచ్‌రోడ్డుకు వెళ్లే కురుపాం సర్కిల్ వరకు ఉన్న ప్రధాన రహదారి రూపురేఖలు పూర్తి స్థాయిలో మారిపోయాయి. ఈ మార్గాన్ని యుద్ధప్రాతిపదికన జీవీఎంసీ అధికారులు మరమ్మతులు చేపట్టి ఆధునికీకరించారు. ముందుగా దత్ ఐలాండ్ నుంచి మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ వరకు ఉన్న రోడ్డును సిద్ధం చేశారు. రహదారులు, ఫుట్‌పాత్‌ల ఆధునికీకరణ, గోడలపై అందమైన బొమ్మలు వేయడం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం జీఐఎస్ సదస్సు జరిగే ఏయూ మైదానానికి వెళ్లే మార్గం అద్దంలా మెరుస్తోంది. ఫుట్‌పాత్‌లపై రంగులు అద్దే పనులు తుది దశకు చేరుకున్నాయి. గురువారం సాయంత్రానికి పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ నెల 4న ప్రారంభమయ్యే జీఐఎస్ సదస్సు నాటికి మొత్తం పనులు పూర్తి చేయాలని అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారు.

సీఎం జగన్‌తోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న అక్కరమాని విజయనిర్మల

ఎంవీపీ కాలనీ: ఉత్తరాంధ్ర అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ 18వ వార్డులో ఆమె స్థానిక పట్టభద్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ పరిపాలన రాజధానిని ఏర్పాటు చేసి ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీఎం జగన్ బాటలు వేయనున్నారన్నారు. రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్, ఎమ్మెల్సీ నామినేటెడ్ అభ్యర్థి కోలా గురువులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంతోనే నిరుద్యోగుల అభ్యున్నతి సాధ్యమన్నారు. సచివాలయ ఉద్యోగాల భర్తీతో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు, పార్టీ 18వ వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి, పుక్కళ్ల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి భవితకు పదో తరగతి తొలిమెట్టు



మాట్లాడుతున్న ఆచార్య ప్రసాద్

ఏయూ క్యాంపస్: విద్యార్థి భవితకు పదో తరగతి తొలిమెట్టుగా నిలుస్తుందని పెట్రోలియం విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ అన్నారు. ఈస్ట్ పాయింట్ కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో బుధవారం జరిగిన పదో తరగతి పరీక్షల సన్నాహక అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధిస్తే జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి అవకాశాలు ఉంటాయన్నారు. గాయత్రి విద్యా పరిషత్ ఉపాధ్యక్షుడు ఆచార్య దక్షిణామూర్తి, సంస్థల సంయుక్త కార్యదర్శి ఆచార్య కామేశ్వరరావు, ప్రిన్సిపాల్ మధురవాణి పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ జాతర



అమ్మవారిని తోడ్కొని వెళ్తున్న భక్తులు



జాతరలో జన సందోహం

డాబాగార్డెన్స్: జగదాంబ జంక్షన్ వద్ద కొలువుదీరిన ఎల్లమ్మవారి జాతర బుధవారం వైభవంగా జరిగింది. ఆలయం వద్ద అమ్మవారి దర్శనం కోసం వేకువజాము నుంచి భక్తులు బారులు తీరారు. అమ్మవారితో పాటు ఆమె సోదరుడు పోతురాజుకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు, దేవదాయ శాఖ అధికారులు దర్శించుకున్నారు. ఎల్లమ్మతోట, చాకలిపేట, కనకలవీధి, కుమ్మరవీధి, దిబ్బలపాలెం, ప్రకాశరావుపేట, మహారాణిపేట, అంగటిదిబ్బ, డాబాగార్డెన్స్, సూర్యాబాగ్, బొడ్డునాయుడు తోట, లలితానగర్ తదితర ప్రాంతాలతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, భీమిలి, కొత్తవలస తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. జాతర సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. రాత్రికి ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేంకటేశ్వర థియేటర్ సమీపంలో ఉన్న ఎల్లమ్మతల్లి పుట్ట వద్ద మాలధారులు శూలాల ప్రదర్శన చేపట్టారు. అగ్నిగుండం తొక్కారు. టూటౌన్, మహారాణిపేట పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.పద్మావతి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తొలేళ్లతో ప్రారంభం : మహాశివరాత్రి తర్వాత తొమ్మిదో రోజు మృగశిర నక్షత్రాన అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీ. అమ్మవారి జాతర ముందు రోజున(మంగళవారం) అర్ధరాత్రి దాటిన తర్వాత వన్‌టౌన్ జిల్లెలమూడు వీధిలోని జొన్నాడ గురుమూర్తి ఇంట్లో ఉన్న చదునుపట్టు వద్ద ఎల్లమ్మ అమ్మవారు, సోదరుడు పోతురాజుకు పప్పు, బియ్యం, ఉలవలతో ఉపారం పెట్టి అక్కడి నుంచి మేళతాళాలతో అమ్మవారిని తోడ్కొని వచ్చారు.

రైల్వే ట్రాక్‌పై వ్యక్తి ఆత్మహత్యాయత్నం



మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ వద్ద రైల్వే ట్రాక్ మీద ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి

మహారాణిపేట: మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ సమీపంలో రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ఆయన కుడి చేయి తెగిపడింది. 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుడి వయస్సు 45 ఏళ్లు ఉండ వచ్చునని 108 వాహన సిబ్బంది తెలిపారు.

పొత్తులు పెట్టుకుంటే భయమెందుకు?

మాజీ హోంమంత్రి నిమ్మకాయల చిన్నరాజప్ప



ఇందిరానగర్ సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న మాజీ హోంమంత్రి చిన్నరాజప్ప

ఆరిలోవ: వచ్చే సాధారణ ఎన్నికల్లో ఇతర పార్టీలతో టీడీపీ పొత్తులు పెట్టుకుంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు భయమెందుకని మాజీ హోంమంత్రి నిమ్మకాయల చిన్నరాజప్ప అన్నారు. విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మితో కలసి బుధవారం ఆరిలోవ ప్రాంతంలో ఆయన పలు సచివాలయాలను సందర్శించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ బలపరుస్తున్న చిరంజీవిరావుకు ఓటేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్టీ రామారావు టీడీపీ స్థాపించినప్పటి నుంచి చిన్న పార్టీలను కలుపుకొని వెళ్లాలనేది సిద్ధాంతమన్నారు. దమ్ముంటే టీడీపీ సమావేశాలు నిర్వహించుకోవడానికి ఆటంకాలు కలిగించకుండా ఉండాలన్నారు. టీడీపీ నిర్వహించే సమావేశాలను పోలీసులతో అడ్డుకుంటున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో పోలీసులు బాగా పనిచేశారని చెప్పారు. ఇప్పుడు మాత్రం పోలీసులు ప్రభుత్వానికి తొత్తులుగా మారారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఒమ్మి సన్యాసిరావు, పోలారావు, సత్యం, అప్పలరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



విష్ణుమూర్తి (ఫైల్)

గోపాలపట్నం: లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన కాకానినగర్ వద్ద చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం దరి యల్లపువానిపాలేనికి చెందిన వావిలపల్లి విష్ణుమూర్తి (28), అతని స్నేహితుడు ఉప్పాడ భాగ్యరాజ్‌తో కలసి ద్విచక్రవాహనంపై మంగళవారం రాత్రి మాధవధార వెళ్తున్నారు. కాకానినగర్ రైల్వే బ్రిడ్జ్ సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో వాహనం నడుపుతున్న విష్ణుమూర్తికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెనుక కూర్చున్న భాగ్యరాజు ఆటోలో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి తల్లి, తండ్రి అన్న ఉన్నారు. ఎయిర్‌పోర్టు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఎస్‌ఐ శివకుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు.

రుద్రాక్షల అలంకరణలో సుత్తమ్మ తల్లి



రుద్రాక్షలతో అలంకరించిన సుత్తమ్మ తల్లి విగ్రహం

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ గ్రామ దేవత సుత్తమ్మతల్లిని స్థానిక భవానీ పీఠం, ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం 83,160 రుద్రాక్షలతో అలంకరించారు. ప్రతీ నెల పౌర్ణమి ముందు రోజు వచ్చే బుధవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు పసుపు కొమ్ములు, నెమలిపింఛాలు, తులసి, వివిధ రకాల పుష్పాలు, వాక్కాయ, అరటి, కొబ్బరి, గాజులు, ద్రాక్ష, యాపిల్, మామిడి, చెరకు, కూరగాయలతో అలంకరించారు. ఈ నెల అలంకరణలో భాగంగా వారణాసి నుంచి తీసుకొచ్చిన రుద్రాక్షలను 108 వంతున 770 దండలు కట్టి అమ్మవారి విగ్రహంతోపాటు ఉత్సవ విగ్రహానికి కూడా అలంకరించారు. ఈ రుద్రాక్షలు వారణాసి నుంచి తీసుకురావడానికి రూ.50 వేలు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు సందర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

విశ్వజనీనత ప్రతిబింబించేలా కవిత్వం

సీతంపేట: కవులందరూ కవిత్వ తత్వాన్ని అలవర్చుకోవాలని గజల్ గాయని జ్యోతిర్మయి మళ్ల అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనసులను కదిలించే ప్రేమ, జాలి, కరుణ, కళాత్మకత రంగరించి విశ్వజనీనత ప్రతిబింబించేలా కవిత్వం ఉండాలని సూచించారు. పలు గజల్స్ పాడి వినిపించారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వాన్ని వివిధ పద్ధతుల్లో వ్యక్తీకరించవచ్చని, అందులో పద్యం, వచన కవిత, లఘు కవితా రీతులైన నానీలు, హైకూలు, రెక్కలు మొదలైన ప్రక్రియలే కాకుండా పారశీక ప్రక్రియ గజల్స్ బాగా ప్రాచుర్యం పొందాయన్నారు. అటువంటి గజల్స్ ప్రక్రియలో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బాగా పేరొందిన కవయిత్రి గజల్ గాయని జ్యోతిర్మయి మళ్ల అని కొనియాడారు. రచయిత కె.జి.వేణు మాట్లాడుతూ ఇటీవల మరణించిన గజల్ కవయిత్రి బైరి ఇందిర గురించి, ఆమె కవిత్వంలోని విశేషాలను వివరించారు. సాహితీవేత్తలు, రచయితలు కె.వి.ఎస్.మూర్తి, డి.వి.సూర్యారావు, పి.ఎల్.వి.ప్రసాద్, చిన సూర్యనారాయణ, రామతాత, రమణకొత్తూరి కవితలు వినిపించారు.

సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా ప్రచారం



11వ వార్డు అంబేడ్కర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్



13వ వార్డు పాండురంగాపురంలో పట్టభద్రుడికి కరపత్రం అందిస్తున్న అక్కరమాని విజయనిర్మల



22వ వార్డులో ప్రచారం చేస్తున్న పీతల గోవింద్



15వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిల్చున్న సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ నాయకులు బుధవారం విస్తృత ప్రచారం చేశారు. జీవీఎంసీ 11వ వార్డులో పార్టీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ స్థానిక నాయకులతో కలసి టీఐసీ పాయింట్, అంబేడ్కర్‌నగర్‌లో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కొరికాన మోహనరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మూర్తి, జహీంగీర్, మక్బుల్ పాల్గొన్నారు.

➡ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీలో నిలిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటేయాలని ఆ పార్టీ నియోజకవర్గం సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల కోరారు. జీవీఎంసీ 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీతతో కలసి ఆమె బుధవారం ప్రచారం చేశారు. పాండురంగాపురంలో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కెల్ల సత్యనారాయణ, కె.శిరీషా, పిల్లి వీర్రాజు, పోలారావు, అప్పలనాయుడు, కొండమ్మ పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు మద్దతుగా జీవీఎంసీ 28వ వార్డులో కార్పొరేటర్ పల్లా అప్పలకొండ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ప్రచారం చేశారు. 22వ వార్డులో పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ ఇంటింటికి వెళ్లి సుధాకర్‌కు ఓటు వేయాలని కోరారు.

23వ వార్డులో..

మద్దిలపాలెం: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజుకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి స్థానిక నాయకులతో కలిసి చైతన్యనగర్ కాలనీలో ప్రచారం చేశారు. కనకమ్మ గుడి, అపార్ట్‌మెంట్లలో గల పట్టభద్రులైన ఓటర్ల ఇంటికి వెళ్లి ఓటు అభ్యర్థించారు.

➡ జీవీఎంసీ 15 వార్డులో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు, నాయకులు హెచ్‌బీ కాలనీలో ప్రచారం చేశారు. తమ మొదటి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేయాలని కోరారు.

శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు జయంత్యుత్సవాలు ప్రారంభం



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్: జిల్లా పరిషత్ కార్యాలయ సమీపంలోని శ్రీకృష్ణ చైతన్య మఠం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు జయంత్యుత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సాయంత్రం 4 గంటలకు శ్రీకృష్ణ చైతన్య మఠం నుంచి ఆర్కే బీచ్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు విశేష హారతి, నీరాజనం, మంత్ర పుష్పాలు, తీర్థ ప్రసాద గోష్ఠి జరిపారు. గురువారం ఉదయం 8 గంటలకు మహాసంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాసూత్రధారణ, అంకురార్పణ, మండపారాధన, విశేష హోమాలు, సాయంత్రం 5 గంటల నుంచి నామ సంకీర్తనాలు నిర్వహించనున్నారు.

ఆర్‌జేడీగా మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌కు బాధ్యతలు



డాక్టర్ శోభారాణిని అభినందిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి జోన్–1 రీజనల్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జేడీ)గా పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది బుధవారం ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఏయూ సమాచారం

నిరంతర అధ్యయనంతో మెరుగైన ఫలితాలు



మాట్లాడుతున్న రిటైర్డ్ డీజీపీ సాంబశివరావు

ఏయూ క్యాంపస్: నిరంతర అభ్యసనం, అధ్యయనంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని రిటైర్డ్ డీజీపీ ఎన్.సాంబశివరావు అన్నారు. ఏయూ అర్థశాస్త్ర విభాగ సమావేశ మందిరంలో బుధవారం ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఒక నిర్దిష్టమైన అంశంపై లోతైన అవగాహన కలగాలంటే ముందుగా పలుమార్లు దానిని చదవాలన్నారు. తద్వారా అర్థం చేసుకుని, అవగాహన పెంచుకోవడానికి వీలవుతుందన్నారు. ముఖ్యమైన అంశాలపై నోట్స్ తయారీ, సివిల్ సర్వీస్ పరీక్షలకు సిద్ధం కావడంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పరీక్షకు సన్నాహం, చదవాల్సిన పుస్తకాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య డి.పుల్లారావు, విభాగ ఆచార్యులు జి.నాగరాజు, డాక్టర్ బి.లిల్లీ గ్రేస్, డాక్టర్ డి.ఆశాలత, డాక్టర్ వి.వి.ఎస్.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్‌లో పాల్గొని ప్రతిభ చూపిన ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం విద్యార్థులను వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. తమిళనాడులోని మధురై నగరంలోని త్యాగరాజన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో జరిగిన యుక్తి 23 మేనేజ్‌మెంట్ మీట్‌లో పాల్గొన్న ఎంబీఏ విద్యార్థులు ఎం.స్వర్ణలత, కె.వి.వైష్ణవి, కె.ఆశిష్, ఎన్.భరత్‌కుమార్‌లు వివిధ పోటీలలో విజయం సాధించడంపై వీసీ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డాక్టర్ ఎస్.రంజిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

3న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఈ నెల 3న ఉచిత ఆయుర్వేద వైద్య చికిత్స శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కేంద్రం విభాగాధిపతి డాక్టర్ కె.రమేష్‌బాబు తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బీచ్‌రోడ్డులోని యోగా కేంద్రంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. విశ్రాంత ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ కె.ఈశ్వరరావు రోగులను పరీక్షించి తగిన చికిత్స విధానాలను సూచిస్తారన్నారు. దీర్ఘకాలిక రోగులు తమ మెడికల్ రిపోర్టులను తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆరిలోవ: టీఐసీ పాయింట్ సమీప విద్యా కాలనీలోని భారతీ విద్యా నికేతన్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ప్రాజెక్టులతో పాటు సి.వి.రామన్ తదితర 50 మంది శాస్త్రవేత్తల చిత్ర పటాలను ప్రదర్శించారు. ప్రాజెక్టుల ఉపయోగం, అవి పని చేసే విధానం గురించి విద్యార్థులు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధినేత ఎం.వి.రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్లమాంబకు ప్రత్యేక పూజలు



అమ్మవారి ఆలయం వద్ద భక్తుల సందడి

మద్దిలపాలెం: పాత వెంకోజీపాలెంలో ఎల్లమాంబ అమ్మవారి జాతర బుధవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. సాయంత్రం సీతారామా సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామాలయం నుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామస్తులు అమ్మవారికి సారె సమర్పించారు. జాతరలో భాగంగా చిరువ్యాపారులు ఏర్పాటు చేసిన షాపుల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. రాత్రికి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విశాలాక్షినగర్ ప్రాంతం 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో 11 కేవీ కైలాసగిరి ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్ నిర్వహణ పనులు జరగనున్నాయి. దీంతో విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, హనుమంతవాక కొండవాలు, బి.ఎస్.ఆర్ నగర్, తోటగరువు ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

'ప్రైవేట్'లో 25 శాతం సీట్లపై 5న అవగాహన సదస్సు

మద్దిలపాలెం: పేద విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు మొదటి తరగతిలో ప్రవేశాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.24పై ఈ నెల 5న అవగాహన సదస్సు నిర్వహించనున్నామని రైట్ టూ ఎడ్యుకేషన్ ఫోరం ప్రతినిధి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టంలో భాగంగా కేటాయించనున్న 25 శాతం సీట్లపై తల్లిదండ్రులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వనున్నామన్నారు. బుల్లయ్య కళాశాల గాంధీ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు ఈ సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

అలరించిన భక్తి రంజని

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం స్వరరంజని ఆధ్వర్యంలో భక్తి గీతాలాపన భక్తులను ఆకట్టుకుంది. వేంకటేశ్వర స్వామిని స్తుతిస్తూ ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. సంస్థ అధ్యక్షురాలు లతారాములు, ప్రధాన కార్యదర్శి కోరుకొండ రంగారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.